# చెలిమ

"మా పెద్దక్క బిడ్డ పెద్దదైంది. ఎల్లుండి చీరె కట్టిస్తున్నరు. తప్పక రావాలె." అని జెడ్పీటీసీ సభ్యురాలు ద్యావనపెల్లి కరుణ అడగడంతో సర్పంచు మ్యాకల లక్ష్మి సరేనంది. లక్ష్మికక్కాడా ఆ వూళ్ళో చిన్నపని ఉంది. ఆ పనేమిటో కరుణ చెవిలో వేస్తే "ఆ పని నేను చూసుకుంట నీకెందుకు శ్రమ" అని భరోసా యిచ్చింది. ఆ రెండు పనుల కోసం వాళ్ళు కొంచెం పొద్దున్నే బయలుదేరారు.

ఊళ్ళోకి వెళ్ళే బస్సు ఎత్తిపోవడంతో రోడ్డుమీదే దిగి నడక ప్రారంభించారు. ఇరవై నిమిషాలు నడిస్తే ఊరు. జగిత్యాల టౌన్‌కు అరగంట దూరంలోనే ఉన్నా అది పూర్తిగా పల్లెటూరు. శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతం. రోడ్డు కాడికి ఎవరినైనా స్కూటరిచ్చి పంపుతా అని అక్క అన్నది గాని కరుణనే వద్దన్నది.

ఇంటికి చేరేసరికి వాకిట్లో టెంటు అప్పుడే వేస్తున్నారు. వంట మనుషులు వంట అపుడే మొదలుపెట్టినట్టున్నారు. 'శృతి'కి స్నానం చేయించి కొత్త పట్టులంగా జాకెట్ కట్టించి కూర్చోబెట్టారు. పేరంటం మొదలవడానికి ఎంతలేదన్నా యింకా రెండు గంటలు పడుతుంది. ఈలోపు ఊళ్ళోకి పోయివద్దాం అని ఇంట్లో అందర్నీ పలకరించి లక్ష్మిని బయల్దేరదీసింది కరుణ.

ద్యావనపెల్లి కరుణ, మ్యాకల లక్ష్మిగారలది దగ్గరి దగ్గరి ఊర్లు. వాళ్ళిద్దరి ఊర్ల నడుమ మరో ఊరుంది. ఆ వూళ్ళోని జిల్లా పరిషత్ హైస్కూలులో లక్ష్మి ఏడవ తరగతిలో ఉన్నపుడు కరుణ పదవ తరగతి చదువుతోంది. మండల స్థాయి స్కూలు ఖోఖో పోటీల్లో జూనియర్స్ టీంలో లక్ష్మి, సీనియర్స్ టీంలో కరుణ ఎన్నికయ్యారు. అలా నాల్రోజులు కోచింగ్‌లో, పోటీల్లో కల్సి ఉన్నారు. అదే పరిచయం స్నేహంగా మారింది.

వీళ్ళు వెళ్ళేసరికి ఆ వూరి బీసి సర్పంచ్ గాజుల భూమయ్య ఇంటికాన్నే ఉన్నాడు. ఎవరో పంచాయతీ పరిష్కారం కోసం టైం ఎపుడిస్తారో అని అడగవచ్చిన వాళ్ళున్నారక్కడ.

"నమస్కారం" అంటూ లేచి కరుణక్కకు నమస్కరించాడు సర్పంచు భూమయ్య. "జెడ్పీటీసీ కరుణక్క" అంటూ తనకోసం వచ్చిన వారికి పరిచయం చేశాడు. వాళ్ళు నమస్కరించారు. లక్ష్మిని భూమన్నకు పరిచయం చేసింది. పరస్పర నమస్కారాలు కుశల ప్రశ్నలు అయ్యాక అదీ యిదీ అడిగి తెల్సుకుంది కరుణ. ఏ స్కీం ఎలా అమలు చేస్తున్నారో భూమయ్య చెప్తున్నాడు.

"మీ ఊర్లె లోనుకోసం ఎన్ని దరఖాస్తులచ్చినై. ఎంత ష్యూరిటీ యిచ్చినా బ్యాంకోల్లు పాతలోన్లు వసూలయ్యే దాకా కొత్త లోన్లు యియ్య మంటున్నరు వేరే మార్గం చూడాలె...."

"అందుకే దరఖాస్తులు ఎక్కువిస్తలేరు. ఓ మాలోల్ల పిల్లగాడు వడ్లగిర్ని (హల్లర్) కోసం లోన్ కావాలన్నడు. ఓ సాకలోల్ల పిలగాడు కిరాణాషాపుకు లోన్ కావాలన్నడు. ఒక మాదిగోల్ల పిలగాడు సైకిల్ టెక్సికి లోన్ కావాలన్నాడు. ఇంకో మాదిగోల్ల పిలగాడు ఆటోకోసం లోన్ దరఖాస్తు యిచ్చిండు..... వాల్లకు ఏం జెప్పాన్నో తోస్తలేదు....."

"మనం జెడ్పి తరపున ఏదన్న చెయ్యాలె. వాల్లను పిలిపిస్తె వాల్లకు స్యూరిటీలు సాల్తయా..... తీసుకున్నంక లోన్ కడ్తరా కట్టరా.... కొంచెం సూడాలె"

"అట్లనే" అని ఎవర్నో ఆ పనికి పురమాయించాడు భూమయ్య.

"మొన్న సర్పంచులకు మహిళావార్డు మెంబర్లకు యిచ్చిన ట్రేనింగ్ ఎంతో మంచిగుంది గ్రామీణ వికాసం, గ్రామపంచాయతీల నిర్వహణ మార్గదర్శిని" అనే రెండు పుస్తకాలు ఎంత గొప్ప పుస్తకాలు" అంది లక్ష్మి.

"వార్డు మెంబర్ ఆడోల్లకు కూడ అన్ని విప్పి చెప్పేసరికి మనం ఎక్కడ ఎట్ల తింటున్నమో అన్ని రహస్యాలు తెలియజెప్పినట్టాయె. అని గులిగే మన సర్పంచులు లేరా!" అని నవ్వాడు భూమయ్య.

లక్ష్మి, కరుణ కూడా ఆ నవ్వుతో జతకలిపారు.

"ఆ ట్రేనింగ్ చేసిన్నించి యిక ఎప్పుడు నా వెంట రావద్దు, పైరవీలు తేవద్దు. నేను చెప్తే వినది.... మీరే కలసి చెప్పుకోన్రి అని అందరికి చెప్పుమని నీకే రిస్కు తగ్గుతదని మొన్న కరాకండిగ నవ్వుకుంటనే చెప్పిన మా ఆయనకు" అని మళ్ళీ నవ్వింది కరుణ. మళ్ళీ తనే అంది.

"మొన్న ఉగాదినాడు గుల్లె పంచాంగ శ్రవణం భలే జరిగింది. మా మండలంల ఈ ఏడు పంట ఎట్ల ఉంటది.... రాశిఫలాలు ముందుగాల చెప్పాలె అని అడిగిన. ముందుగాల జెడ్పిటీసి సంవత్సర రాశిఫలాలు చెప్పాలంటే నాకన్న ముందు మా ఆయన చెయి చాపిండు. జెడ్పిటీసీ కరుణక్కకు ముందుగాల సూడాలె అని ఆడోల్లు గట్టిగ నవ్వుకుంట అడిగిన్రు. నా చెయ్యి చూసి రాశిఫలం చెప్పినంక మా వూరి సర్పంచు గొల్ల కొమురవ్వ రాశిఫలం చెప్పిండు అయ్యగారు. అటెనుకి లేడీస్ ఫస్టు అని స్త్రీవార్డు మెంబర్ల రాశిఫలాలు చూపించిన. అటెనుక మహిళా సంగపోల్లు..... ఇట్లె ఒకలెనుక ఒకల్లు ఆడోల్లే రాశిఫలాలు చూయించుకున్నారు. ఆడోల్లయినంక మొగోల్ల వంతు వచ్చింది."

లక్ష్మికి తమ ఊళ్ళో జరిగింది గుర్తొచ్చి నవ్వుతూ చెప్పింది. "భూమన్నా మా ఊర్లెగూడ గిట్లనే అయింది. మేం మాదిగోల్లం అని చెయ్యి పట్టి చూసుటానికి అయ్యగారు వెనక ముందైతే నాకు నవ్వు వచ్చింది. అయ్యగారిని ఏడిపిద్దామని నా రెండు చేతులు పట్టుకునెటట్టుజేసిన"

"ఎట్ల!"

"ఎట్లేమున్నది. మొగోల్లకు కుడిచెయ్యి చూస్తరట. ఆడోల్లకు ఎడంచెయ్యి చూస్తరట. ఎడం చెయ్యి చూసి అంత చెప్పినంక - లేదు లేదు..... ఆడోల్లకు కూడ కుడిచెయ్యి చూసే చెప్పాలె. ఈ కుడిచెయ్యి చూసి ఎట్లుంటయో ఫలాలు చెప్పుమన్న. ఆడోల్లకు ముందుగాల నేను అడిగిన మాట అర్థం కాలేదు. "ఔనౌను. కుడిచెయ్యి కోతీరు ఎడం చెయ్యికో తీరు రాశిఫలాలుంటే అవేం రాశిఫలాలు. కుడిచెయ్యి చూసే చెప్పాలె అని కొందరు అన్నవోల్లె అయ్యగారి మొకం జూడాలె. ఆ మాటతోని ఇంతదాక ఏం జెప్పిందో మల్లగవ్వే కుడిచెయ్యి చూసుకుంట చెప్పిండు."

"నీపెండ్లి గురించి ఏం జెప్పిండే" కరుణ చొరవగా అడిగింది.

"అయితే ఈ శ్రావణమాసం ముహూర్తాలల్ల, అది దాటితే దీపావళి ముహూర్తాలల్ల నీకు లగ్గం బలం ఎక్కువున్నది అని అన్నడు"

"నమస్తే సర్పంచ్‌సాబ్" అంటూ ఓ యువకుడు పలకరించడంతో ఆ చర్చ ఆగిపోయింది.

"మా ఊర్లె బాగ చదువుకున్న మాదిగోల్ల పిలగాడితడు. బొందల గడ్డ సుధాకర్. బి.ఈడి చేసిండుగని మొన్నటి డీఎస్సీల రాలేదు. ఆటో కోసం లోన్‌కు దరఖాస్తు పెట్టిండు. లోన్‌వస్తే ఆటో తీస్కోడట. ఆ పైసల్తోని స్కూలు పెడ్తడట."

"మంచి ఆలోచనే గని బ్యాంకోల్లు ఒప్పుకుంటరో లేదో.... అయితే సుధాకర్‌గారూ... మీరు స్కూలును ఈ ఊళ్ళో పెడ్తరా.... మీ వాడకు పెడ్తరా....." ఆరా తీసింది కరుణ.

"మా మాదిగవాడకు ఊరికి నడుమ ఒక ఎకరం రోడ్‌సైడుకు కిరాయకు తీస్కోని రేకుల షెడ్లలు వేద్దామని.... అట్లయితే అందరికి దగ్గర." అన్నాడు సుధాకర్.

"టీచర్ ఉద్యోగం వస్తే ఎట్లా?" అడిగింది లక్ష్మి.

"నేను మావూరి దగ్గర ఊర్లకు పోస్టింగ్ వేయించుకుంట మా సర్పంచ్ సాబ్ లేడా చెప్పుటానికి. కష్టమైతే నా భార్య చూసుకుంటది."

"పైసా సంపాదన లేకుంట అప్పుడే పెళ్ళి చేసుకున్నరా?" సుధాకర్ని నిండుగా చూస్తూ నవ్వుతూ అడిగింది లక్ష్మి.

"లేదక్కా... కాదు మేడం.... నాకింకా పెళ్ళికాలేదు సర్పంచ్‌సాబ్" ఎట్లా సంబోధించాలో కాస్త తడబడ్డాడు సుధాకర్. ఏమంటే అక్కా అని పిలిచేంత వయస్సు లేదు లక్ష్మికి. మేడం అని పిలిచేంత సంస్కారవంతమైన స్త్రీలా లేదు. వేరే ఊరి సర్‌పంచ్‌ను సర్‌పంచ్ సాబ్ అని సంబోధించడానికి తోచడం లేదు. అలా కాదనుకుని ఆమెను స్త్రీగా చూద్దామనుకుంటే కుదరదు. ఆమె అడిగే స్థాయిలో ఉండె. తాను చెప్పే స్థాయిలో ఉండె.

"సుధాకర్ నిలబడే మాట్లాడవడ్తివి. కూర్చో" అని బల్ల చూపించాడు భూమయ్య.

"అయితే నీ పెళ్ళి కాకముందే పెళ్ళయినంక నీ భార్య ఏం పని చేయాలో ముందే నిర్ణయించేశావన్నమాట... నీ భార్యకు స్కూలు నడపడం యిష్టం లేదనుకో. నీలాగ ఉద్యోగమో. నాలాగ రాజకీయాలో చేయాలనుకుంటే అపుడెట్లా....." నవ్వి అడిగింది కరుణ.

"ఎవరికి నడపడం వీలుకాకపోతే స్కూలు ఎవరికన్న అమ్మేస్త...."

"మీరు స్కూలు తప్పక నడుపుకుంటనంటే నాకు తెల్సిన ఫైనాన్సులో తక్కువ వడ్డీకి లోన్ యిప్పిస్త. మీ యిల్లూ అదీ ఓసారి చూద్దామా." అంటూ లేచింది కరుణ.

"లచ్చవ్వా ఎవలన్నవస్తే హరిజనవాడకు రమ్మను" అని భార్యకు చెప్పి సర్పంచు భూమయ్య సుధాకర్‌వాళ్ళ యింటికేసి దారితీశాడు. ఊరూ మాదిగవాడా పెరుగుతూ కల్సిపోతున్నయి. వాడకూ ఊరుకూ నడుమ ఫర్లాంగు ఎడం మాత్రమే పొలాలు పెరండ్లుగా మిగిలాయి. వాటిలో కూడా అక్కడక్కడ ప్లాట్లు చేసి అమ్ముతున్నట్టు ఖనీలు(అయిడర్‌లు)న్నాయి.

సుధాకర్‌ది తాటాకుల గుడిసె. వాకిట్లో పందిరి కింద సుధాకర్ తల్లి ఈతాకుతో చీపుర్లు తయారు చేస్తోంది. తండ్రి ఈతనార చీరుతూ నీల్లలో నానపెడ్తున్నాడు. సాయంత్రానికి ఈతతాడు నేస్తాడు కావచ్చు.

"నమస్కారం అయ్యా!" అని లక్ష్మి సుధాకర్ తల్లిదండ్రులకు ముందుగా నమస్కరించింది. భూమయ్య వాళ్ళను వారికి పరిచయం చేశాడు.

ఇంటి వెనక కొంచెం స్థలం ఉంది. ఓ నిమ్మ, ఓ జామ చెట్లున్నాయి.

"ఎంత మందన్నా నీకు పిల్లలు" కరుణ అడిగింది.

"ఇద్దరు బిడ్డల వెనుక వీడు. వీవెనుక ఇంకోడు. వాడు ఈతపండ్లకని ఈదుల్ల పొంట వోయిండు" అంది తల్లి.

"నీ కొడుకు స్కూలు పెడ్తనంటున్నడు. లోన్ కావాల్నట. ఈ యిల్లు కుదవ పెడ్తేనే యిస్తరు. మీకిష్టమేనా...."

"ఏదో గా నౌకరి యిప్పిస్తె మంచిగుండు. మాదిగోల్ల బడికి ఊరోల్లు పిలగాల్లను పంపుతరో

లేదో.... ఈడేమో ఇస్కూలు పెద్ద పెద్ద అని అంటడు. మీరందరు గల్సి తల్సుకుంటే గీ ఒక్కనికి నౌకరి యిప్పియ్యరాదా అవ్వా" అంటూ చేతులు జోడించింది తల్లి. కాళ్ళు పట్టుకోబోతే కరుణ దూరం జరిగింది.

"ఉద్యోగాలంటే అంత అల్కగ కాదమ్మా. మొన్నటి సెలక్షన్ల మండలాధ్యక్షురాలుగా వేములవాడ మొకాన పని చేస్తున్నామె కూడా సెలక్టు కాలే. మరి ఆమె చేతికింద ఇన్నూరు.... ఇంటున్నవా ఇన్నూరు మంది పంతుల్లు ఇద్దరు డాక్టర్లు పదిమంది నర్సులు పని చేస్తున్నరు. ఆ మండలానికి ఆమె ఎమ్మెల్లే తర్వాత ఎమ్మెల్లే అంత మనిషి. నీకొడుకు సదివినట్టె బిఈడి సదివింది. కని సెలక్టు గాకపాయె."

"ఎట్లంటరయ్య మరి బడి పెట్టుకొమ్మంటర? మావోడు బడి పెడ్తె ఎవలస్తరయ్యా..."

"గట్ల అనుకోవద్దమ్మా.... ఇగో లక్ష్మి కూడా మాదిగోల్లే. సర్పంచుగ ఎన్నుకున్నరు. ఇంకా పెండ్లిగాలే. చిన్నప్పుడు పెండ్లయి కార్యం కాక ముందు యిడుపు కాగితాలైనై. గీ చిన్నపిల్లకు నమస్తె పెట్టుడా అనుకున్నరు. కని యాడాది తిరిగేటాల్లకు అందరు సర్పంచక్కా సర్పంచమ్మా అని పిలుస్తున్నరు. మాదిగిండ్లల్లకే పోయి లక్ష్మిని కలుస్తలేరా. ఇక్కడ భూమన్న తన యింటికాడ ఎట్లా పంచాయతులు చెప్తున్నడో గట్లనే తన యింటికాన్నే మాదిగల వాడలనే ఊరోల్ల పంచాయతులు చెప్తున్నది లక్ష్మి. అవసరం ఉన్నోల్లు కలుస్తలేరా. వస్తలేరా. ఏదైనా గంతే. కొంచెం అలవాటు గావాలె. అలవాటు అయ్యేదాక కొంచెం తిప్పలు. ఇంకా నాలుగేండ్లు వేములవాడ ఆమె మండలాధక్షురాలుగ చేసినంక ఇప్పటోలే టీచర్ ఉద్యోగం కోసం తిరుగుతదా! పిలిచి యిస్తనన్నా చెయ్యది. మల్ల మండలాధక్షురాలుగనో, సర్పంచుగనో, చేస్తనంటదిగని టీచర్‌గ చెయ్యది. బడిల సదువు మంచిగచెప్తే ఏం కులం అని సూడరు. నీ కొడుకు బడిలకే పంపుతరు....." అంటూ సముదాయించింది కరుణ.

అవీ యివీ మాట్లాడి అక్కన్నించి బయలుదేరారు. సుధాకర్‌ను తమ అక్క యింటికి భోజనానికి రమ్మని మరీ మరీ చెప్పింది కరుణ. భూమన్నను కూడా ఆహ్వానించి సెలవు తీసుకుంది కరుణ.

"పిలగాడు ఎట్లున్నడు.... సర్పంచుగారికి నచ్చినట్టేనా!" తోవలో నవ్వుతూ అడిగింది కరుణ.

"ఎంత చూసినా ఒక్కసారికే ఒక నిర్ణయానికి రాకూడదు అని మనకు ట్రేనింగ్‌లో సార్లు చెప్పలేదా! ఇంకా అన్నివిషయాలు తెల్సుకోవాలె..." అని సర్పంచులా గంభీరంగా అంటూ నవ్వింది లక్ష్మి.

"ఈ కొత్తరకం పెండ్లి చూపులకు పిలగాడేమన్న బాధపడ్తడంటవా!" మళ్ళీ తనే అంది లక్ష్మి.

"గట్ల బాధపడేటట్టు మనం ఏం చేసినం. అందర్తోని కలిసి మాట్లాడినం. అయినా బాధపడ్తే అలాంటి వాడు సర్పంచుకు భర్తగా పనికిరాడు. అసలు నన్నడిగితే పిల్లనే పిలగానింటికి పిలగాన్ని చూడపోవాలె. తన అత్తగారిల్లు, పరిసరాలు ఎట్లా ఉంటాయో ఆడపిల్లకే తెల్సుకోవడం అవసరం. ఎందుకంటే పిల్లఅత్తగారింట స్థిరపడ్తది కని పిలగాడు కాదుగద. అందుకని పిలగాని యింటికాన్నే పిల్లగాన్ని పెండ్లి పిల్ల తీరు కూసోపెట్టి పిల్ల పిల్లతల్లిదండ్రులు సూసి మాట్లాడాలె" అంది కరుణ.

తోవలో కల్సిన వారితో మాట్లాడ్తూ పేరంటం యింటికి చేరేసరికి యిల్లు పట్టు చీరెల్తో కళకళ లాడుతోంది. "నమస్కారం జెడ్‌పీటీసీ కరుణక్కా" అంటూ ఎవరెవరో బంధుమిత్రుల పరామర్శలు. కౌగలింతలు. పట్టుచీరెల రెపరెపల్లో లక్ష్మి కొంచెం వెలవెలబోయింది.

తనకు తెల్సిన వాళ్ళందరికి సర్పంచు లక్ష్మక్క అంటూ పరిచయం చేసింది కరుణ. చెంపలకు పసుపు, నొసటబొట్టు పెడ్తూ వస్తున్నవారు వీళ్ళిద్దరికి మరికొంచెం ఎక్కువ దట్టించారు. కరుణ తాను అక్క కూతురు శృతి కోసం తెచ్చిన చీరను ఒడిలో పెట్టి చెంపలు నొక్కి అక్షింతలు వేసింది.

ఆడవాళ్ళు రాజకీయాలు-రాజకీయాల్లో ఆడవాళ్ళు గురించి ఎన్నో ముచ్చట్లు సాగాయి. మధ్యమధ్యలో వాళ్ళ అభిప్రాయాల్ని సరిచేస్తూ కరుణ, లక్ష్మి, తమ అనుభవాల్ని వాళ్ళతో కల్సి పంచుకున్నారు. కొంచెం చొరవ ఏర్పడ్డంతోనే లక్ష్మి కలుపుగోలుగా మారిపోయింది. చర్చ పట్టు చీరెలమీది కెళ్ళింది.

"మన ఆడోల్లను నగలకు, పట్టుచీరెలకు ముర్సిపోయేట్టు చేసి మొగోల్లు అన్నివాల్లవిగా మార్చుకున్నరు. రెండువేల పట్టుచీరెనట యిది. అంటే దీనికి నెలకు నలభయి రూ॥లు వడ్డీ చొప్పున యాడాదికి అయిదు వందల వడ్డీ అయితది. నాలుగైదు పట్టుచీరెలంటె పది పదిహేను వేల రూపాయలు.... అర ఎకరం పెరడు వస్తది. లేకపోతే ఓ లూనా, టీవియస్ మోపెడ్ వస్తది. దానిమీద బట్టలు వేసుకొని మీరుకూడా బ్యారాలు చేసిరావచ్చు. మీరంత పద్మశాలీలు బట్టల బ్యారం అలవాటేనాయె. లేకపోతే ఈ పట్టుచీరెల పైసలతోని చిన్నగ ఓ కోళ్ళఫారమే పెట్టుకోవచ్చు. ఇంటికాడ కూసున్నకాడ నెలకు వెయ్యి రూ॥లు కోళ్ళఫారంల సంపాయించవచ్చు. అంతగనం కష్టపడి, బీడీలు చేసి సంపాయించిన పైసలు.... పట్టు చీరెలు కొంటే ఎంత వృధా ఖర్చు.... మనం ఈ నగల మోజు చీరెల మోజు వదిలించుకుంటె మన దగ్గర ఎన్ని పైసలు మిగులుతయో....."

లక్ష్మి మాటల మధ్యలోనే సుధాకర్, భూమన్న భోజనానికి వచ్చినట్టున్నారు.

"ఇగో మేం చెప్తే మొగోల్లు గట్లనే అంటరు అంటిరి. అందుకనే గవర్నమెంటు ఆడోల్లను కూడా నాయకులుగావాలె అని చెప్పింది. పట్టుచీరెలు, పండుగలు, పెండ్లిల్లు పెద్ద ఎత్తున చేసి ఉన్నకాడికి ఒడగొట్టుకొని అప్పులకు చెయి సాపుడు మంచిది కాదని మన లక్ష్మక్క కరుణక్క చెప్తున్నది. యిని ఇక నుంచన్నా కొంచెం మారుర్రి." అన్నాడు భూమయ్య.

"ఔను. పాకిస్తాన్‌ల బురఖాలు వేసుకునే ఆడోల్లు కూడా మొగోల్లతోని సమానం అంటున్నరు. పెండ్లి పేరంటాలకు, ఖర్చులు చేసేది లేదని అక్కడ చట్టం తెచ్చిన్రు. మన దగ్గర కూడా అసొంటి చట్టం రావాలె. ఈ ఊర్లె అందరి పెండ్లిల్లు ఒకటే కాడ నెలకు ఓరోజు నిశ్చయం చేసి ఆ రోజున్నే జరుపాలె. మనిషికి యాభయిమంది సుట్టాలు పక్కాలు కన్న ఎక్కోవద్దు. అందరు కలిస్తె ఊరంత పండుగతీరుంటది. ఖర్చు తగ్గుతది" అంది కరుణ.

"చీరెలద్దు, పండుగల కర్సులద్దు. ఇట్ల అనుకుంటపోతె అన్నీవద్దని పిస్తయి. ఇక దేనికీ బతుకుడు" అంది ఓ ముత్తయిదువ. మంచిగ అడిగినవు అన్నట్లు చూశారు మిగతావాళ్ళు.సర్పంచు భూమన్న సుధాకర్‌కు లక్ష్మి గురించి ఏం చెప్పాడో. ఒకటికి రెండుసార్లు ఆమెను మళ్ళీ మళ్ళీ చూసే ప్రయత్నం చేశాడు. కాని చుట్టూ ఆడవాళ్ళు.... సిగ్గు. పైగా ఆడవాళ్ళు ఆమె కనపడకుండా ఏదో పనిమీద అటూ యిటూ నడవడం. సరిగ్గా చూసినట్టనిపించలేదు సుధాకర్‌కు.

"సంపాయించేదే తక్కువ. దాన్ని వృధా ఖర్చుచేసి అప్పులు చేసుడెందుకు. పొదుపుతో ఎంతో పైకి రావచ్చు...." అంటూ వివరంగా చెప్పింది కరుణ. తొమ్మిదో తరగతి పూర్తయి పట్టుచీర కట్టుకొని అపుడే పూచిన పూవులా నిగనిగలాడుతున్న శృతి కరుణ చిన్నమ్మ, సర్పంచ్ లక్ష్మక్క మాట్లాడేవన్నీ జాగ్రత్తగా వింటోంది. వాళ్ళిద్దరి వ్యక్తిత్వాలు రేపటి శృతి వ్యక్తిత్వంపై ఎంత గొప్ప ప్రభావం వేస్తాయో యిపుడే ఎవరు చెప్పగలరు.

అందరూ భోంచేసి వెళ్ళాక కరుణ లక్ష్మి పక్కింట్లో స్థలం సంపాదించి నడుం వాల్చారు. చిన్నమ్మతో మాట్లాడాలని తీరిక చేసికొని అక్కడికి శృతి చేరేసరికి వాళ్ళకు మగత నిద్ర పట్టేసింది. కొద్దిసేపు ఎదిరిచూసింది. వాళ్ళు లేచి "ఎంతసేపైందే వచ్చి..... లేపక పోయినవు" అంటూ శృతిని పలకరించారు. ముఖం కడుక్కుని వచ్చి కూర్చున్నారు.

అవీ యివీ అడిగి విషయంలోకి వచ్చింది శృతి.

"చిన్నమ్మా, ఇన్ని చెప్తవు. ఈ చీరె కట్టిచ్చుడు ఇంట్లకూసోపెట్టుడు ఎందుకు బందు చేయించలేదే. ఇపుడు నాకు బజార్లకు పోవాలంటేనే సిగ్గనిపిస్తంది."

"సిగ్గు పడాల్ననే యివి పెట్టిరి..... గడియారం పెట్టుకుంటె ఒక చేతికన్న గాజులేసుకునుడు తప్పుతదని ఈ పనిచేసిన. ఈ చెయికి ఒక రింగు బస్....." అంటూ నవ్వింది లక్ష్మి.

"నీకు ఇంతకుముందు ముక్కుపుల్ల కూడా ఉన్నట్టుంది గద అక్కా...."

"ఔను. మీటింగుకు పోవుడు వచ్చుడు. బస్సులు ఎక్కుడు దిగుడు..... ఓకెయి చీమిడి చీదుతె ముక్కుపుల్ల అడ్డంబడి యింకోకెయి చీమిడి పడు. అది కుచ్చుకపోవుడు. అన్ని తీసి పడేసిన. మరీ బోడబోడ ఉండద్దని గీ చెవి రింగులు పెట్టుకున్న" అంది లక్ష్మి.

"చిన్నమ్మా మొగోల్లకు పండుగెందుకు జెయ్యరే - పెద్దోల్లయినట్టు....."

"మంచి ప్రశ్ననే. వెనుకట మొగోల్ల మీసాలు గడ్డాలు తీసుటానికి పండుగుతీరు చేద్దురట. ఇపుడు పోయింది....."

చిన్నమ్మ జవాబు శృతి అనుమానాన్ని తీర్చలేకపోయిందని ఆ ముఖమే చెప్తోంది.

"అది కాదు చిన్నమ్మా.... మొగోల్లు కూడ పెద్దమనిషైనట్టు వారం పదిరోజులు ఇంట్ల కూసోపెట్టి గిట్లనే భోజనాలు పెట్టించే పండుగు ఎందుకులేదు?"

"నువ్వు ఎమ్మెల్లే అయినంక అసెంబ్లీల వేయాల్సిన ప్రశ్న ఇపుడు నాకేస్తె ఎట్లనే..." అంటూ నవ్వి శృతి తల నిమిరింది కరుణ.

"నిజంగనే శృతి ఎమ్మెల్లే అయితది. ఆ ప్రశ్న వేసేతీరు, ఆ మొఖంల కళ కనపడ్తనే ఉన్నయి." అని శృతి చెంపల్ని ప్రేమగా గిచ్చింది లక్ష్మి.

శృతి సంతోషంతో మూడు వంకర్లు పోయింది. ఇలాంటి చిన్న చిన్న ప్రోత్సాహక మాటలే పిల్లల్లో గొప్ప శక్తిని కలిగిస్తాయని మహిళా సర్పంచ్‌ల ట్రేనింగ్‌లో సత్యమ్మ మేడం చెప్పింది వారికి బాగా గుర్తున్నట్టుంది.

సాయంత్రం కరుణ లక్ష్మి బయలుదేరారు. చెట్లు కనపడ్డంతో చాటుకు వెళ్ళారు. లక్ష్మికి అది వాగు అని - అక్కడ చెలమలు చెల్లారని అపుడే చూసింది...

"అబ్బ... పొద్దువంగినా ధగడు తగ్గలే... అంటూ చెలిమ చల్లి ముఖం కాల్లు చేతులు కడుక్కుంది లక్ష్మి. కడుపు నిండా చల్లని నీళ్ళు తాగింది. కరుణ కొత్త చెలిమ తోడింది. అదీ అంతే చల్లగా కొత్తగా ఉంది. వాళ్ళ జీవితాలలాగే ఆ చెలిమలు చూడ్డానికి బెత్తెడు లోతులేవు. కాని చల్లిన కొద్దీ కొత్తనీరు. చల్లిన కొద్దీ కొత్త ఆలోచనలు.

రోడ్డుమీద బస్టాపులో ప్రయాణీకులెవరూ లేరు. ఎవరో తాటిముంజల గెల తీసుకు పోతున్నారు.

"అబ్బ..... తాజా ముంజలు. తిందామా అక్కా...." లక్ష్మికి నోరూరింది. పెద్దగా గీచి గీచి బేరం చేయకుండానే చెరి మూడు ముంజకాయలు కొట్టించుకున్నారు. గీచి గీచి బేరం చేయడం హోదాకు భంగం అనే శిక్షణపాఠం వారికి ఒంటపట్టినట్టుంది. ఎక్కువ బేరం చేయక పోవడంతో ఆ గౌడు మరో రెండు ముంజకాయలు ఉచితంగా కోసి యిచ్చాడు. అతన్తో అదీ యిదీ ఊరు విషయాలు అడిగి తెల్సుకున్నారు. బ్రేవ్‌మని తృప్తిదీరా తిన్నారు. చేతులు మూతులు కడుక్కోవడానికి నీళ్ళడిగితే గౌడు వాగుకేసి చూపాడు. బస్సు వస్తే కొంచెం ఆపు అంటూ వాళ్ళు రోడ్డు పక్కదాకా వచ్చిన వాగులోని చెలిమల్ని చల్లుకుని కడుక్కున్నారు. బస్సురాలేదు. గౌడు పైసలు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఈ ఊరు ఎలా ఉంది. నీకు నచ్చిందా....." రాజ్యం ఏలడం కోసం దత్తత యిస్తున్న మహారాణి అడిగినట్టుగా ఉంది కరుణ ప్రశ్న. లేక లక్ష్మికే అలా అన్పించింది.

"అంతా మంచిగనే ఉంది కని....." అంటూ ఆగిపోయింది లక్ష్మి.

"ఏంటిది. కానీ...."

"వచ్చే టర్మ్‌కు ఆ వూరి సర్పంచ్‌ను, అక్కడి జెడ్‌పిటీసీని, ఎంపిటీసీని ఆడోల్లకు రిజర్వు చేయించుతానంటే.... సరే....."

"అబ్బ యిపుడు నువ్వు నిజంగ రాజకీయ నాయకురాలివేనే" అంటూ వొయ్యారంగా లక్ష్మిని తొడగిచ్చి నడుం గిచ్చి షేక్ హ్యాండు తీసుకుని చేయిని బిగ్గరగా నొక్కి పట్టింది కరుణ.

అపుడే బస్సొచ్చింది. గబగబా ఎక్కారు. వెనకనించి ఎవరో తమ పేర్లు పదవుల్ని చెప్పుకుంటూ ముచ్చటిస్తున్నారు. నిండు ఆత్మవిశ్వాసంతో వాళ్ళకు ప్రతి నమస్కారం చేసి సీట్లో కూర్చున్నారు వాళ్ళు.

***13 జులై 1997***

ఆంధ్రభూమి దినపత్రిక